ప్రజాశక్తి
మంగళవారం 15 అక్టోబర్ 2024
5
అనంతపురం

నార్పల 'గురుకులం'కు ఐఎస్ఒ సర్టిఫికెట్

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాలకు ఐఎస్ఒ (ఇంటర్నేషనల్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్) సర్టిఫికెట్ లభించినట్లు పాఠశాల కన్వీనర్ సంగీతకుమారి తెలిపారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ వినోద్‌కుమార్ నుంచి సర్టిఫికెట్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా సంగీతకుమారి మాట్లాడుతూ దేశంలో మొదటిసారి ఐఎస్ఒ సర్టిఫికెట్ అందుకున్న ప్రభుత్వ గురుకుల పాఠశాల అని తెలిపారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యాబోధన పాఠశాలగా నార్పల గురుకులానికి గుర్తింపు రావడం సంతోషకరమన్నారు. పాఠశాలలోని ఉపాధ్యాయులు, సిబ్బంది కృషితోనే ఇది సాధ్యమైందన్నారు.

'అధికార'ం ల(కి)క్కు..!

అధికార పార్టీ నేతలకే మెజార్టీ మద్యం దుకాణాలు

జెఎన్‌టియులో లాటరీ తీస్తున్న అధికారులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మద్యం దుకాణాల టెండర్లలో ఎక్కువ షాపులు అధికార పార్టీ మద్దతుదారులను వరించాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో మద్యం దుకాణాల టెండర్లలో అత్యధికంగా అధికారపార్టీ నేతలకు దక్కడం విశేషం. అనంతపురం జిల్లాలో 136 మద్యం దుకాణాలకు 3261 దరఖాస్తులు పడ్డాయి. సత్యసాయి జిల్లాలో 87 దుకాణాలకు 1518 దరఖాస్తులు పడ్డాయి. ఇందులో అత్యధికంగా అధికార టిడిపితోపాటు, కూటమిలోని బిజెపి నేతలకు లాటరీలో మద్యం దుకాణాలు దక్కాయి.

బిజెపి జిల్లా అధ్యక్షుడికి ఐదు దుకాణాలు

మద్యం టెండర్లలోకి నేరుగానే నేతలు రంగంలోకి దిగారు. వారికే అత్యధికంగా దుకాణాలు దక్కాయి. ఇందులో ధర్మవరం నియోజకదర్గంలో ఐదు దుకాణాలు అనంతపురం బిజెపి జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసరెడ్డికి దక్కాయి. ఈయనతోపాటు అనంతపురం, తాడిపత్రి, గుంతకల్లు నియోజకవర్గాల్లో ప్రజాప్రతినిధుల అనుయాయులకు గరిష్టంగా దుకాణాలొచ్చాయి. కొన్ని చోట్ల మాత్రమే ఇతరులకు లక్కీ లాటరీలో వచ్చాయి. వాటిని కూడా ఏదో రకంగా తమ వశం చేసుకోవడానికి అధికారపార్టీ నేతలు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇందుకోసం బేరసారాలు నడుస్తుండగా, మాట వినిచోట బెదిరంపులు ఉంటున్నాయి. సత్యసాయి జిల్లా లేపాక్షికి సంబంధించి ఒక దుకాణం వేరే వ్యక్తికి రావడంతో అతడిని కిడ్నాప్ చేసారన్న కలకలం రేగింది. లోపాయికారిగా అతడి నుంచి దుకాణాన్ని అధికారపార్టీ నేతలే వశం చేసుకునే ప్రయత్నాలు సాగాయన్న ఆరోపణలున్నాయి.

మహిళలకు దక్కిన దుకాణాలు

మద్యం దుకాణాల టెండర్లలో మహిళలూ పాల్గొన్నారు. ఇందులో కొన్ని దుకాణాలు మహిళలకు వచ్చాయి. అనంతపురం జిల్లాలో 136 దుకాణాల్లో 20 దుకాణాలు మహిళలకు లాటరీలో తగిలాయి. ఇందులో నాలుగు దుకాణాలు ఒక్క మహిళకే దక్కాయి. సత్యసాయి జిల్లాలో నలుగురు మహిళలకు మద్యం దుకాణాల టెండర్లు లాటరీలో వచ్చాయి.

బేరసారాలు

లాటరీ ప్రక్రియ పూర్తవడంతో టెండరు దక్కించుకున్న వారితో బేరసారాలు మొదలయ్యాయి. దరఖాస్తు చేసుకుని లాటరీలో దక్కని వారు వచ్చిన వారితో భాగస్వామ్యం కోసం జోరుగా బేరసారాలు సాగుతున్నాయి. ఈనెల 16వ తేదీ నుంచే దకాణాలు ప్రారంభించాల్సి ఉన్నందున హడావుడి కొనసాగుతోంది. కొంతమంది టెండరు దక్కిన వారు ఇతరులకు భాగస్వామ్యం ఇవ్వడానికి భేటీలు కొనసాగుతున్నాయి. షాపులకు రూముల కోసం కూడా ప్రయత్నాలు సాగుతున్నాయి.

మద్యం టెండర్‌లో కిడ్నాప్ కలకలం

సాయిఆరామం వద్ద నిరసన తెలుపుతున్న రంగనాథ్ కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

మద్యం టెండర్ల విషయంలో కిడ్నాప్ కలకలం రేగింది. సోమవారం జిల్లా వ్యాప్తంగా మద్యం దుకాణాలకు టెండర్ ప్రక్రియ లాటరీని పుట్టపర్తి సాయి ఆరామం అతిథి గహంలో న్విహించారు. హిందూపురం నియోజకవర్గం చిలమత్తూరు మండలం ఎగ్గిలి కొత్తపల్లి గ్రామానికి చెందిన రంగనాథ్ అనే వ్యక్తికి లేపాక్షి మండలానికి సంబంధించిన షాప్ నెంబర్ 57లాటరీలో వచ్చింది. లాటరీలో ఆయన పేరు రావడంతో లేపాక్షి టిడిపి నాయకులు ఆయనను కిడ్నాప్ చేశారు. దీంతో ఆయన భార్య అశ్విని బంధువులతో కలిసి స్థానిక అర్బన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలీసులు చుట్టూ తిరిగినా ఆమెకు న్యాయం జరక్కపోవడంతో సాయి ఆరామం గేటు వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. రంగనాథ్ తండ్రి

పోలీసు స్టేషన్ వద్ద ఆత్మహత్యాయత్నం

ఓబులేష్ మాట్లాడుతూ కిడ్నాప్ చేసిన వ్యక్తులు తన కుమారుడు టెండర్ వదిలేయాలని, రూ.10 లక్షలు గుడ్ విల్ ఇస్తామని, ప్రతినెలా 15 వేలు భరణం ఇస్తామని తెలిపారన్నారు. దీనికి తాము ఒప్పుకోకపోవడంతో బెదిరిస్తున్నారని చెప్పారు. తమకు న్యాయం చేయాలని ఆయన కోరారు. భార్య అశ్విని మాట్లాడుతూ తమకు ఎలాంటి టెండర్ అవసరం లేదని, తన భర్తను వదిలేయాలని కోరుతున్నామన్నారు. ఈ ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసు స్టేషన్ వద్ద బాధితుల ఆత్మహత్యాయత్నం

కిడ్నాప్‌కు గురైన వ్యక్తిని వెంటనే తీసుకురావాలని కోరుతూ బాధిత కుటుంబ సభ్యులు సోమవారం రాత్రి పుట్టపర్తి పోలీస్ స్టేషన్ ముందు బైటాయించి ధర్నా నిర్వహించారు. ఇదే సమయంలో రంగనాథ్ తండ్రి ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశారు. పోలీసులు స్పందించి అతన్ని నివారించారు. ఇదే సమయంలోనే రంగనాథ్ హిందూపురం పట్టణంలో పోలీసుల వద్ద క్షేమంగా ఉన్నట్లు సమాచారం అందింది. లాటరీలో దుకాణం వస్తే ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆయన్ను ఎందుకు పుట్టపర్తికి తీసుకురావడం లేదని కుటుంబ సభ్యులు పోలీసులను నిలదీశారు.

సాగునీటి కోసం

నేటి నుంచి సిపిఎం బస్సుయాత్ర

బస్సుయాత్ర రూట్‌మ్యాప్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

- హెచ్ఎల్‌సి ఆధునీకరణతోనే సాగునీటి వినియోగం సాధ్యం
- బస్సుయాత్రలో సాగునీటి సమస్యలను ప్రజల దృష్టికి తెస్తాం
- 21న కలెక్టరేట్ ఎదుట మహాధర్నా
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సాగునీటి కోసం సిపిఎం బస్సుయాత్రకు శ్రీకారం చుట్టింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని సాగునీటి కాలువలను పరిశీలిస్తూ మంగళవారం నుంచి ఈ నెల 21వ తేదీ వరకు ఈ యాత్ర సాగనుంది. బస్సుయాత్రలో గుర్తించిన సమస్యలన్నింటినీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేలా ఈ నెల 21వ తేదీన సిపిఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద మహాధర్నా జరగనుంది. రైతు, ప్రజాసంక్షేమం కాంక్షిస్తూ చేపట్టిన ఈ బస్సుయాత్రను విజయవంతం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో బస్సుయాత్ర రూట్‌మ్యాప్ పోస్టర్లను విడుదల చేశారు. బస్సుయాత్ర మంగళవారం ఉదయం బొమ్మనహాల్ మండలం ఉంతకల్లు గ్రామం హెచ్ఎల్సీ 105వ కిలోమీటర్ నుంచి ప్రారంభం అయ్యి జిల్లాలో చివరి ఆయకట్టు ప్రాంతం తాడిపత్రి తాలుకా వరకు కొనసాగుతుందన్నారు. బస్సుయాత్ర అనంతరం 21న కలెక్టరేట్ వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

హెచ్ఎల్సీని ఆధునీకరించాలి : రాంభూపాల్

ఉమ్మడి అనంతపురం జిల్లా రైతాంగానికి సాగునీరు అందించాలంటే హెచ్ఎల్‌సిని ఆధునీకరించడమే ఏకైక మార్గమని, ఆ దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. తుంగభద్ర, కింద శ్రీశైలం డ్యామ్‌లు నిండి పొంగి పొర్లుతున్నా జిల్లాకు రావాల్సిన నీరు రాకపోవడం దారుణమన్నారు. అనంతపురం జిల్లా వారసత్వ సంపదగా చెరువులు కుంటలు ఉన్నాయని, వీటిన్నింటినీ నింపితే రైతులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. నీటి పారుదల కాలువలతో గ్రావిటీ ద్వారా చెరువులు, కుంటలను అనుసంధానం చేయాలనే రైతుల కోర్కెలను పాలకులు అమలు చేయకపోవడం విచారకరం అన్నారు. టిడిపి, కూటమి నాయకులు ఎన్నికల ముందు జిల్లా పర్యటనల్లో హెచ్ఎల్‌సి ఆధునీకరణ చేస్తామని వాగ్దానాలు చేశారన్నారు. అధికారం చేపట్టి 100 రోజులు పూర్తి అయినప్పటికీ హెచ్ఎల్‌సి ఆధునీకరణపై ప్రకటన చేయలేదన్నారు. గతనెలలో ఐఎబి సమావేశంలో లక్ష ఎకరాలకు సాగునీటిని అందిస్తామని అధికారికంగా ప్రకటించారని, వస్తున్న నీరు చూస్తే 40 వేల ఎకరాలకు మాత్రమే వచ్చే అవకాశం కన్పిస్తోందన్నారు. హెచ్ఎల్‌సి ఆధునీకరణ చేయకపోవడంతో హంద్రీనీవా కాలువ సామర్థ్యానికి తగ్గట్టుగా నీళ్ల తెచ్చుకోలేకపోతున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం కాలువ ఆధునీకరణ ఎప్పుడు చేపడతారో తెలపాలన్నారు. శ్రీశైలంలో డ్యాం పూర్తిగా నిండి మూడు సార్లు గేట్లు ఎత్తారన్నారు. పూర్తి సామర్థ్యంతో డ్యాం నిండి ఉన్నా బ్యాక్ వాటర్ హంద్రీనీవా ద్వారా తెచ్చుకోవాల్సిన నీటిని తెచ్చుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. డ్యాం నుంచి లిఫ్ట్ ద్వారా నీటిని తీసుకురావాల్సి ఉందన్నారు. ఇందుకు సంబంధించి విద్యుత్ బిల్లులు ఇవ్వాల్సి వస్తుందన్న నెపంతో పాలకులు జిల్లాను ఎండబెడుతున్నారన్నారు. తుంగభద్రలో నీరు ఉన్నప్పటికీ హెచ్ఎల్‌సి ఆధునీకరణ చేయనందున, శ్రీశైలంలో డ్యాంలో నీరున్నా విద్యుత్ బిల్లులు కట్టలేనందు నీరు తీసుకురాలేని పరిస్థితి ఉందన్నారు. పాలకుల నిర్లక్ష్యం జిల్లాలో సాగు, తాగునీటి సమస్యలపై పూర్తిగా పడిందన్నారు. ఉంతకల్లు జలాశయం నిర్మిస్తామని స్వయంగా చంద్రబాబు నాయుడు చెప్పారని, ఇప్పటికీ ఈ హామీపై ఎలాంటి పురోగతి లేకపోవడం విచారకరం అన్నారు. సాగునీటి వనరులను అభివృద్ధి చేయకుండా జిల్లా అభివృద్ధి కాదన్న విషయాన్ని పాలకులు గుర్తించాలన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం సాగునీటి వనరుల కల్పనపై దృష్టి సారించాలని కోరారు. తుంగభద్ర డ్యాం 31 గేట్లను కొత్తవి ఏర్పాటు చేయాలన్నారు. ఆ గేట్లకు అయ్యే ఖర్చు కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మూడు ప్రభుత్వాలు చెరో రూ.50 కోట్ల చొప్పున రూ.150 కోట్లు ఖర్చు చేయాలన్నారు. పాదయాత్రలో వీటన్నింటినీ ప్రజలకు తెలియజేస్తూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఓ.నల్లప్ప, ఎం.బాలరంగయ్య, ఎస్.నాగేంద్రకుమార్, వి.సావిత్రి పాల్గొన్నారు.

సిపిఎం బస్సుయాత్ర రూట్ మ్యాప్ ఇలా..

తేదీ :15-10-2024

బొమ్మనహాల్ మండలం ఉంతకల్లు హెచ్ఎల్సీ 105వ కిలోమీటర్ వద్ద ఉదయం 10 గంటలకు యాత్ర ప్రారంభం
కనేకల్లు - 11.30గం॥
రాయదుర్గం - 12.30గం॥
గుమ్మగట్ట -1.40గం॥
బిటిపి - 2.00గం॥
బ్రహ్మసముద్రం - 3.30గం॥
కళ్యాణదుర్గం- 5.30గం॥

తేదీ 16-10-24

కాలువపల్లి -ఉ॥10.30గం॥
జీడిపల్లి - 11.00గం॥
రామసాగరం - 11.40గం॥
రాకెట్ల - 12.20గం॥
అమిదాల - 1.00గం॥
ఉరవకొండ - 1.40గం॥
రాగులపాడు - 2.10గం॥
వజ్రకరూరు - 3.00గం॥
గుంతకల్లు - 5.00గం॥

తేదీ : 17-10-2024

నాగసముద్రం- ఉ॥10.20గం॥
అయ్యవారిపల్లి- 10.50గం॥
పామిడి - 11.20గం॥
కల్లూరు - 12.10గం॥
తరిమెల - 1.40గం॥
చిట్యాల - 2.30గం॥
పెద్దవడుగూరు - 3.30గం॥
క్రిష్టిపాడు - 4.00గం॥
యాడికి - 5.00గం॥
తాడిపత్రి - 6.00గం॥

తేదీ : 18-10-24

పుట్లూరు - ఉ॥10.00గం॥
కడవకల్లు - 11.00గం॥
మడుగుపల్లి - 11.40గం॥
నార్పల - 12.10గం॥
వెంకటాపురం - 1.30గం॥
రెడ్డి పల్లి - 2.00గం॥
కొర్రపాడు - 2.50గం॥
శింగనమల - 3.10గం॥
గార్లదిన్నె - 4.00గం॥
మర్తాడు - రా॥6.00గం॥

తేదీ :19-10-2020

కుడేరు : 11.00గం॥
ఒడ్డుపల్లి - 12.20గం॥
సనప - 1.10గం॥
అయ్యవారిపల్లి - 1.40గం॥
రాప్తాడు - 2.10గం॥
హంపాపురం - 3.00గం॥
కందుకూరు - 3.40గం॥
మన్నీల - 4.30గం॥
ఆకుతోటపల్లి. 5.30గం॥

21-10-2024
కలెక్టరేట్ ఎదుట మహాధర్నా

వర్షాల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు చేపట్టాం

- 16, 17న విద్యాసంస్థలకు సెలవులు
- కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు
- కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్

విలేకరులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

భారీ వర్షాల నేపథ్యంలో అన్ని ముందస్తు జాగ్రత్త చర్యలూ చేపట్టామని కలెక్టర్ డాక్టర్ డా॥వి.వినోద్ కుమార్ తెలియజేశారు. సోమవారం నాడు కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారీ వర్షాల సూచన నేపథ్యంలో జిల్లాలో 16, 17వ తేదీల్లో ఆరెంజ్ అలర్ట్ ఇచ్చామన్నారు. జిల్లా కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి ఫోన్ నెంబర్లకు మెసేజ్ ద్వారా సమాచారం పంపడం జరిగిందని తెలిపారు. భారీ వర్షాల దృష్ట్యా జిల్లాలో 16, 17వ తేదీలలో అన్ని విద్యాసంస్థలు, అంగన్వాడీ కేంద్రాలు, హాస్టళ్లకు సెలవు ఇచ్చామన్నారు. ప్రతి మూడు గంటలకు ఒకసారి సైక్లోన్ అప్డేట్స్ వస్తున్నాయన్నారు. భారీ వర్షం అంటే 20 మిల్లీమీటర్ల నుంచి 80 మిల్లీమీటర్ల వరకు వచ్చే అవకాశం ఉందన్నారు. కొన్ని ప్రాంతాల్లో 100 మిల్లీమీటర్ల వర్షం వచ్చే అవకాశం ఉందని తెలిపారు. జిల్లా కలెక్టరేట్లో శాశ్వత కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. ఇందులో ఒక మొబైల్ నంబర్ (8500292992), ల్యాండ్ లైన్ నెంబర్ (08554-220009)లకు ఫోన్ చేయవచ్చన్నారు. అనంతపురం, కళ్యాణదుర్గం, గుంతకల్లు ఆర్డీవో కార్యాలయాల్లో టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతపురం ఆర్డీవో కార్యాలయం టోల్ ఫ్రీ నెంబర్ 1800-425-8802, కళ్యాణదుర్గం ఆర్డీవో కార్యాలయం టోల్ ఫ్రీ నెంబర్ 1800-425-8803, గుంతకల్ ఆర్డీవో కార్యాలయం టోల్ ఫ్రీ నెంబర్ 1800-425-8804 ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని ప్రతి మండలంలో, మున్సిపాలిటీలలో కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లాలో ఎవరికైనా, ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే ఫొటో, వీడియోల ద్వారా వాట్సాప్ ల ఫోన్ నెంబర్ ద్వారా పంపించాలన్నారు. జిల్లాలో జెసిబిలు, ట్రాక్టర్లు, డ్రింకింగ్ వాటర్ ట్యాంకర్లకు సంబంధించిన వివరాలు సిద్ధంగా ఉంచుతున్నామన్నారు. జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో రిజర్వ్ పోలీస్ వారిని అప్రమత్తంగా ఉండాలని, వారికి శిక్షణ ఇచ్చామన్నారు. అనంతపురం నగరంలో నడిమివంక, మరువ వంక ప్రాంతాల్లో జెసిబిలు, డ్రైన్ క్లీనింగ్ మిషన్లతో శుభ్రం చేసే చర్యలు చేపట్టామన్నారు. 16, 17వ తేదీల్లో అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రాకూడదన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్ రెడ్డి, డిటిసి వీర్రాజు, డిపిఎం ఆనంద్, కలెక్టరేట్ ఏవో అలెగ్జాండర్, తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు : సిఐ

ప్రజశక్తి-కణేకల్లు

గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని రాయదుర్గం రూరల్ సిఐ వెంకటరమణ హెచ్చరించారు. మండలంలోని బెనికల్ గ్రామంలో సోమవారం రూరల్ సిఐ వెంకట రమణ కణేకల్లు ఎస్ఐ నాగమధుతో కలిసి గ్రామసభ నిర్వహించారు. సిఐ మాట్లాడుతూ గ్రామంలో ఎలాంటి గొడవలకు తావు లేకుండా ప్రశాంతంగా జీవించాలని ప్రజలకు సూచించారు. చట్ట వ్యతి రేకంగా వ్యవహరిస్తే చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు. అసాంఘిక కార్యకలాపాల జోలికి వెళ్లరాదన్నారు. ఇతర రాష్ట్రాల మద్యం, నాటుసారాకు దూరంగా ఉండాలన్నారు. మట్కా, పేకాట జోలికెళ్లినా చర్యలు తప్పవన్నారు. బాల్య వివాహాలు, సైబర్ నేరాలు, మహిళా సంబంధిత నేరాలకు పరిష్కారాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో పోలీసులు ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ

ప్రజాశక్తి-డి.హీరేహాల్

'పల్లె పండుగ' కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మండలంలో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. అందులో సోమలాపురం, వసుగుడ్డం, నాగలాపురం గ్రామాల్లో సీసీ రోడ్లు, అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. వసుగుడ్డం గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి పాలనలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. టిడిపి అధికారం లో వచ్చిన అనతి కాలంలోని పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేస్తుందన్నారు. నియోజకవర్గంలో దాదాపు రూ. 16 కోట్లు వెచ్చించి ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, డ్రెయినేజీ, ఎన్టీఆర్ గృహ నిర్మాణం లాంటి అభివృద్ధి పనులను చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో దాస్‌నాయక్, తహశీల్దార్ అనిల్‌కుమార్, పంచాయతీరాజ్ డిఇ సుధాకర్‌నాయక్, ఏపీఓ ఆయేషా, టిడిపి మండల కన్వీనర్ హనుమంతరెడ్డి, ఎంపీటీసీ మొండి మల్లికార్జున, గంగాధర్, సర్పంచి ధోనప్ప, నాయకులు మోహన్‌రెడ్డి, శంకర్, గాదిలింగ, వన్నూరుస్వామి, తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కాలవ శ్రీనివాసులు

రోడ్డుపై నిలిచిన మురుగునీరు

రోడ్లపై మురుగు.. రోగాల బారిన ప్రజలు

ప్రజాశక్తి-కుందుర్పి

మండల కేంద్రమైన కుందుర్పిలో పలు వీధుల్లో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా మురుగునీరు రోడ్లపైకి చేరి వీధులు బురదయమం అవుతున్నాయి. దీంతో ప్రజలు రోడ్డుపై అడుగు పెట్టాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు దుర్వాసన వెదజల్లుతుందని, దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. ప్రధానంగా స్థానిక పిల్లుగడ్డ ప్రాంతంలో మురుగు నీరు నిల్ల ఉండడంతో అందులో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. దీనికి తోడు దోమలు వృద్ధి చెంది విష జ్వరాలు విస్పంభిస్తున్నాయని ఆ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంగన్వాడీ కేంద్రం-4 వద్ద రోడ్లు బురదయమం కావడంతో కేంద్రానికి వెళ్లే గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై అధికారులు, ప్రజాప్రతినిధులకు తెలిపినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు మండి పడుతున్నారు. ఇప్పటికే పలువురు రోగాల బారిన పడి వైద్యం కోసం వేలాది రూపాయలు ఖర్చు చేసుకున్నారని ఆ కాలనీ వాసులు పేర్కొంటున్నారు. ఇకనైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థను సరి చేసి రోగాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని ఆ కాలనీ ప్రజలు కోరుతున్నారు.

వర్షాలపై జాగ్రత్త వహించండి

ప్రజాశక్తి-రాయదుర్గం

రానున్న మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు తగిన రక్షణ, జాగ్రత్త చర్యలు పాటించాలని తహశీల్దార్ నాగరాజు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు చెట్ల కింద, శిథిలావస్థలో ఉన్న గృహాల్లో నివాసం ఉండవద్దన్నారు. వాగులు, వంకల వద్దకు వెళ్లవద్దన్నారు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటకు రావాలన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, అత్యవసర సమయంలో కంట్రోల్ రూమ్‌లో ఏర్పాటుచేసిన 89199 12230కు ఫోన్ చేసి సమాచారం తెలపాలని కోరారు.

కెటిఎస్ కళాశాల విద్యార్థులకు గోల్డ్‌మెడల్

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

పట్టణంలోని కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్‌సిసి క్యాడెట్లు శివప్రసాద్, గోపాల్ ఇటీవల తిరుపతిలో జరిగిన ట్రెక్కింగ్ క్యాంపులో పాల్గొని గోల్డ్ మోడల్ సాధించినట్లు ప్రిన్సిపల్ రఘురామ్మూర్తి తెలిపారు. కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు, కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ జట్ల మధ్య జరిగిన వాలీబాల్ పోటీల్లో ఆరో ఆంధ్ర బెటాలియన్ కర్నూల్ గ్రూపులో ప్రాతినిధ్యం వహించిన శివప్రసాద్ గోల్డ్ మెడల్ సాధించాడన్నారు. క్యాంపు ముగించుకొని వచ్చిన ఎన్‌సిసి క్యాడెట్లను ప్రిన్సిపల్‌తో పాటు వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసులు, అధ్యాపకులు అభినందించారు. క్యాంప్, వాలీబాల్ పోటీలో గోల్డ్ మెడల్ సాధించడం కళాశాలకు గర్వకారణమని ప్రిన్సిపల్ తెలిపారు.

విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

విద్యార్థుల నమోదుపై హెచ్‌ఎంలతో సమావేశం

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

ప్రొజెక్టర్ ద్వారా అప్డేషన్‌కు సంబంధించిన వివరాలను వెల్లడిస్తున్న ఎంఇఒలు

మండల వ్యాప్తంగా ప్రతి పాఠశాలలో విద్యార్థులకు ఆపార్ (APAAR) అప్డేషన్ తప్పనిసరి అని ఎంఇఒలు కృష్ణానాయక్, ఓబుళపతి సూచించారు. వారు సోమవారం స్థానిక జడ్పీ హైస్కూల్‌లో మండలంలోని ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఓబుళపతి మాట్లాడుతూ విద్యార్థుల యుడైస్ ప్లస్‌లో ఆధార్ అప్డేషన్, జనరల్ ప్రొఫైల్, 9, 10, 11, 12 తరగతుల విద్యార్థుల ఆపార్ సంఖ్యను జనరేట్ చేయడం, రోజు వారి విద్యార్థుల హాజరును ఆన్‌లైన్ చేయడం, విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పడడం, తదితర అంశాలపై చర్చించారు. 'ఒక దేశం-ఒక విద్యార్థి-ఒక ఆపార్' నినాదంతో విద్యార్థి వివరాలు నమోదు చేయాలన్నారు. ప్రధానోపాధ్యాయులకు సందేహాలు ఉంటే స్థానిక ఎంఆర్‌సి లేదా ఎంఇఒ కార్యాలయంలో సంప్రదించి నివృత్తి చేసుకోవాలన్నారు. సమావేశానికి మండలంలోని ప్రధానోపాధ్యాయులు అందరూ హాజరయ్యారు.

పాలెగాళ్లను గుర్తుచేసేలా జెసి వ్యాఖ్యలు

మద్యంపై లక్కీడే అంటూ టిడిపి మాటలు సిగ్గుచేటు

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

మద్యం ద్వారా వచ్చే ఆదాయంలో నియోజకవర్గం అభివృద్ధికి 15 శాతం కమీషన్ ఇవ్వాలంటూ తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు పాలెగాళ్ల రాజ్యాన్ని గుర్తు చేసేవిలా ఉన్నాయనిసిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ తెలిపారు. సోమవారం ఆయన గణేనాయక్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మద్యం ఆదాయంలో 15 శాతం నియోజకవర్గానికి చెల్లించాలంటూ జెసి వాఖ్యానించడం సిగ్గుచేటుగా ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి బెదిరింపు రాజకీయాలు సరికావన్నారు. జెసి ప్రభాకర్ రెడ్డి వాఖ్యలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్పందించాలన్నారు. ఇలాంటి చర్యలకు టిడిపి బలబరుస్తుందా.. లేదా..? అన్న విషయాలపై ఆ ఆపార్టీ వైఖరి తెలియజేయాలన్నారు. ప్రశ్నిస్తానంటూ రాజకీయాల్లోకి వచ్చిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ రాష్ట్రంలో ఏమి జరిగినా ప్రశ్నించడం లేదన్నారు. జిల్లాలో తాగునీటి కార్మికులు పండుగ రోజు సమ్మె చేస్తున్నా.. మద్యం టెండర్లలో విచ్చలవిడిగా చేసి బెదిరింపులకు పాల్పడుతున్నా.. నీళ్లు లేక హెచ్‌ఎల్‌సి ఎండిపోతున్నా పవన్ కళ్యాన్ ప్రశ్నించడం లేదన్నారు. మద్యం టెండర్‌లు వేస్తున్న రోజు లక్కీడే అంటూ అధికార పార్టీ నేతలు మద్యం వ్యవహరించడం దుర్మార్గంగా ఉందన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా చిలమత్తురులో భార్యాభర్తలను బెదిరించి ఇద్దరు మహిళలపై దుండగులు అత్యాచారం చేయడం అత్యంత అమానుష ఘటన అన్నారు. మద్యం, గంజాయి మత్తు ఎంత ప్రమాదకరం అన్నదానికి ఈ ఘటన అద్దం పడుతోందన్నారు. అధికార పార్టీ నేతలకు ఈ ఘటనపై ఏమీ పట్టనట్లుగా మద్యం టెండర్ల వద్ద లక్కీడే అంటూ మాట్లాడతుండడం సిగ్గుచేటన్నారు. ఈ రకమైన వ్యవహారాన్ని ప్రజాతంత్ర వాదులు జిల్లా అభివృద్ధి కోరే వారంతా ఖండించాలన్నారు.

చిలమత్తూరు అత్యాచార నిందితులను శిక్షించాలి

ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి

విలేకరులతో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరు ఇద్దరు మహిళలపై అత్యాచారం చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి డిమాండ్ చేశారు. సోమవారం ఐద్వా జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మద్యం, గంజాయి మత్తు వల్ల ఎంత ప్రమాదమో చిలమత్తూరు ఘటన ఉదాహరణ అన్నారు. ఇంటి పెద్ద మనిషిని, కుమారుడిని కత్తులతో బెదిరించి కట్టేసి వారి కళ్ల ఎదుటే భార్య, కోడలిని సామూహిక అత్యాచారం చేసిన ఘటన సమాజానికి సిగ్గు చేటుగా ఉందన్నారు. మానవులుగా సహించలేదన్నారు. ఇంతటి ఘాతుకానికి పాల్పడిన నిందితులను ఎంతటి వారున్న వారిని అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలన్నారు. మహిళా మంత్రి సవిత, హిందూపురం ఎమ్మెల్యే బాలక్రిష్ణ ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతంలోనే మహిళలకు రక్షణ లేదంటే ఎంతటి ఆందోళనకరమో ఆలోచించాలన్నారు. మద్యం మత్తులో జరిగే ఇలాంటి ఘోరాలు జరగకుండా ఉండాలంటే మద్యం నియంత్రించి, గంజాయిని సంపూర్ణంగా నిషేదించాలన్నారు. కానీ ప్రభుత్వాలు విచ్చల విడి మద్యం విక్రయాలకు ఆస్కారం కల్పిస్తూ నూతన మద్యం పాలసీ తీసుకొచ్చి టెండర్లు వేస్తున్నారని తెలిపారు. నెల రోజులుగా ఐద్వా, మహిళా సంఘాలుగా మద్యం పాలసీ ఉప సంహరించాలని ఆందోళనలు విజ్ఞాపనలు చేశామన్నారు. ప్రభుత్వంలో ఎలాంటి పునరాలోచన లేదన్నారు. మద్యం టెండర్‌లకు మూడు రోజుల ముందు చిలమత్తూరు అత్యాచార ఘటన సమాజాన్ని కలిచివేస్తోందన్నారు. మద్యం మత్తు ప్రమాదంపై ప్రభుత్వం మేల్కోవాలని, నూతన మద్యం పాలసీపై పునరాలోచించాలని కోరారు. ఇలాంటివి జరగకుండా నిందితులను కఠినంగా శిక్షించాలని, పాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి బాధితులకు న్యాయం చేసి నిందితులను శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కోశాధికారి చంద్రిక, కుమారి తదితరులు పాల్గొన్నారు.

పూడికతీత పనులు వేగవంతం చేయాలి : మేయర్

పూడికతీత పనులను పరిశీలిస్తున్న మేయర్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

వర్షాల నేపథ్యంలో పూడికతీత తొలగింపు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మేయర్ మహమ్మద్ వసీం సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని శాంతి నర్సింగ్ హోం, సోమనాథ్‌నగర్, రజక్‌నగర్, సాయినగర్, అశోక్‌నగర్ ప్రాంతాల్లో చేపట్టిన పూడికతీత పనులను డిప్యూటీ మేయర్లు వాసంతి, విజయ భాస్కర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ వసీం మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో రెండు, మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో నగరంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. నగరంలోని వంకలు, కాలువలల్లో పూడికతీత పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. వంక పరివాహక ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండేలా అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. అవసరమైతే ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సైఫుల్లా, రహంతుల్లా, ఇఇలు షాకిర్‌హుస్సేన్, రాధాకృష్ణ, వైసిపి నాయకులు రామచంద్ర, అరవింద్, రమేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

10,54,356 ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు

అనంతపురం : 2024 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జిల్లాలో 10,54,356 ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు చేసినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి యు.ఉమామహేశ్వరమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ-క్రాప్ నమోదు చేసిన ప్రతిరైతుకూ ఇకెవైసి చేయించామన్నారు. ఇందులో భాగంగానే ఈనెల 9వతేదీ వరకూ సూపర్‌చెక్ చేశామన్నారు. ఈ క్రాప్ నమోదు చేసిన రైతుల ముసాయిదా జాబితాను ఈనెల 14 నుంచి 16వతేదీ వరకూ ఆయా గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లో ప్రదర్శించనున్నట్లు తెలిపారు. జాబితాపై రైతులకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే రైతు సేవా కేంద్రంలోని విఎఎ, విహెచ్‌ఎ, విఎస్‌ఎ, ఎంపిఇఒలకు రాతపూర్వంగా తెలియజేయాలని కోరారు.

మెడికల్ కళాశాలలో ఓరియంటేషన్ కార్యక్రమం

జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

అనంతపురం : నగరంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో 2024-25 బ్యాచ్ నూతన ఎంబిబిఎస్ విద్యార్థుల ఓరియంటేషన్ ప్రోగ్రాంను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య కళాశాల ఔన్నత్యం, అధ్యాపకుల పరిచయం, హాస్టల్ వసతులు, నిబంధనలను వివరించారు. తర్వాత విద్యార్థులకు క్రమశిక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యకళాశాల అదనపు వైద్య సంచాలకులు, ప్రిన్సిపాల్ ఎస్.మాణిక్యరావు, వైస్ ప్రిన్సిపాళ్లు ఎస్.షారోన్‌సోనియా, నవీన్‌కుమార్, వైద్యులు షంషాద్‌బేగం, మధు, చలపతి, శ్యామ్‌ప్రసాద్, పద్మశ్రావణి, వైద్య కళాశాలలోని ఇతర శాఖలకు చెందిన అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు వివరాలు ప్రదర్శన

పంట నమోదు వివరాలను సేకరిస్తున్న ఎఒ సోమశేఖర్

గార్లదిన్నె : 2024 ఖరీఫ్ ఈ-పంట నమోదు చేసుకున్న రైతుల జాబితాను మండల వ్యవసాయ శాఖ అధికారి పి.సోమశేఖర్ పరిశీలించారు. సోమవారం మండలంలోని పలు రైతుసేవా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి ఈ-పంట నమోదు చేసుకున్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ-పంట నమోదు చేసుకున్న రైతుల వివరాలను ఆయా రైతు సేవాకేంద్రంల్లో ప్రదర్శించామని, జాబితాపై ఏమైనా సందేహాలు ఉంటే రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ లలిత పాల్గొన్నారు.

16 నుంచి అంగన్వాడీల ఇంటర్వ్యూలు

ఉరవకొండ : జిల్లాలో ఖాళీగా ఉన్న మినీ అంగన్వాడీ వర్కర్లతోపాటు ఆయా పోస్టుల భర్తీకి ఈనెల 16వతేదీ నుంచి రెవెన్యూ డివిజన్ల వారీగా ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీదేవి తెలిపారు. సోమవారం ఉరవకొండలో విలేకరులతో మాట్లాడుతూ 16న అనంతపురం రెవెన్యూ డివిజన్, 17న కళ్యాణదుర్గం, 18న గుంతకల్లు రెవెన్యూ డివిజన్ పరిధిలోని కేంద్రాల్లో ఉంటాయన్నారు. అభ్యర్థులకు ఇది వరకే కాల్ లెటర్లు పంపామని, వారందరూ ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు.

ఘనంగా గ్యార్మీ వేడుకలు

యల్లనూరు : మండల కేంద్రంలో గ్యార్మీ వేడుకలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ముస్లిములు మండల కేంద్రంలో ప్రధాన వీధులగుండా దస్తగిరి స్వామి గ్రామోత్సవం నిర్వహించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు ఆధ్వర్యంలో కార్మికుల వినతి

వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మున్సిపల్ కార్పొరేషన్‌లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు అనుబంధ మున్సిపల్ యూనియన్ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావేదిక పరిష్కార కార్యక్రమంలో సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎటిఎం నాగరాజు, కె.నాగభూషణ మాట్లాడుతూ నగరపాలక సంస్థలో 20ఏళ్లకుపైగా కార్మికులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. అయినా వారికి కనీసం ఇఎస్ఐ సౌకర్యం కల్పించకపోవడం బాధాకరమన్నారు. తద్వారా కార్మికులు అనారోగ్యాలకు గురైనప్పుడు సరైన వైద్యం పొందలేకపోతున్నారన్నారు. మెరుగైన వైద్యం చేయించుకోలేక చాలామంది కార్మికులు మృత్యువాత పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. చనిపోయిన కార్మికులకు ఇప్పటి వరకూ ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ఉపాధి కల్పించాలని కోరారు. అదేవిధంగా పారిశుధ్య విభాగానికి సంబంధించిన క్లర్క్-ఎఫ్ 1కు, కంప్యూటర్ ఆపరేటర్‌కు సరైన అవగాహన లేకపోవడం వల్ల కార్మికుల సమస్యలు కుప్పలుతెప్పలుగా మిగిలిపోతున్నాయన్నారు. కావున వారి స్థానంలో అనుభవజ్ఞులైన క్లర్క్, కంప్యూటర్ ఆపరేటర్‌ను నియమించాలని కోరారు. అలాగే కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలని, ఇపిఎఫ్‌ను జమ చేయాలని, డిమాండ్ చేశారు. ఆయా సమస్యలు పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నగర కార్యదర్శి సాకే తిరుమలేష్, రెగ్యులర్ యూనియన్ నాయకులు ముత్తురాజు, ఇంజినీరింగ్ సెక్షన్ నాయకులు రాయుడు, పోతలయ్య, మురళీ, జిల్లా కోశాధికారి బత్తల ఆదినారాయణ, నగర ఉపాధ్యక్షులు శేషేంద్రకుమార్, రెగ్యులర్ యూనియన్ సభ్యులు ఆనంద్, నగర మహిళా కన్వీనర్ మంత్రి వరలక్ష్మి, కమిటీ సభ్యులు కిరణ్, లక్ష్మయ్య, మరియమ్మ, బంగ్లా రాఘవేంద్ర, ప్రసాద్, ఆదినారాయణ, రవి, హరి, కుమార్, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పథకాల్లో కార్మిక చట్టాలు అమలు చేయాలి

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

కలెక్టర్‌తో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఉమ్మడి అనంతపురం జిల్లాలో శ్రీరామిరెడ్డి, శ్రీసత్యసాయి తాగునీటి సరఫరా పథకాల్లో పని చేస్తున్న కార్మికులకు ఆయా కాంట్రాక్టర్లు కార్మిక చట్టాలు అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ వి.వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరామ్‌రెడ్డి, శ్రీసత్యసాయి తాగునీటి సరఫరా నిర్వహణకు టెండర్లు నిర్వహిస్తున్న నేపథ్యంలో కార్మిక సంక్షేమ చట్టాలు అమలు అయ్యేలా చూడాలన్నారు. కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించేలా చూడాలన్నారు. పిఎఫ్, గ్రాట్యూటీ, ఇఎస్ఐ బోనస్, సమాన పనికి సమాన వేతనం అమలయ్యేటట్లు టెండర్లలో పొందుపరచాలన్నారు. ప్రస్తుతం కార్మికులకు బకాయి పీఎఫ్, బకాయి జీతాలు చెల్లించిన తర్వాతనే టెండర్లు పిలవాలన్నారు. ఇప్పటికే దాదాపు 20 సంవత్సరాలు పైగా తాగునీటి సరఫరాలో కార్మికులుగా పని చేసి రిటైర్డ్ అయిపోయి రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం కాల్లు అరిగేలా తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రిటైరమెంట్ బెనిఫిట్స్ తక్షణమే చెల్లించాలన్నారు. 2021 నుంచి బోనస్ చేయకుండా చెల్లించకుండా వాయిదా వేస్తూ వస్తున్నారని వీటన్నిటిని ఈ టెండర్స్‌లో పొందు పరచాలన్నారు. ఇందుకు స్పందించిన కలెక్టర్ వెంటనే జడ్పి సిఇఒను పిలిచి ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శ్రీరామిరెడ్డి, శ్రీసత్యసాయి కార్మికుల యూనియన్ నాయకులు అధ్యక్షులు జి.ఈశ్వరయ్య, కార్యదర్శి ఎన్.శ్రీనివాసులు, చిన్న, త్రిలోక్, ఎర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

బస్సుయాత్రను జయప్రదం చేయండి

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కృష్ణమూర్తి


విలేకరులతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కృష్ణమూర్తి

ప్రజాశక్తి-ఉరవకొండ

సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం నుంచి ప్రారంభం కానున్న సాగునీటిపై బస్సుయాత్రను జయప్రదం చేయాలని జిల్లా కమిటీ సభ్యులు కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. సోమవారం కూడేరు మండల కేంద్రంలోని సిపిఎం కార్యాలయంలో మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగునీటి సమస్యల పరిష్కారం కోసం సిపిఎం ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా మంగళవారం బొమ్మనహాల్‌లో బస్సుయాత్ర ప్రారంభమై ఈనెల 21వ తేదీ వరకూ జిల్లాలోని వివిధ ప్రాంతాల మీదుగా సాగుతుందన్నారు. 27 మండలాలు, వందగ్రామాల మీదుగా బస్సుయాత్ర కొనసాగుతుందన్నారు. 19న ఉదయం 10 గంటలకు మర్తాడు, కోటంక, కమ్మూరుతోపాటు అరు గ్రామాల మీదుగా మండల కేంద్రానికి చేరుకుంటుందన్నారు. కావున మండలంలోని ప్రజలు రైతులు ప్రజలందరూ కలిసి బస్సుయాత్రను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఇకపోతే ఎగువున తుంగబద్ర డ్యాం, దిగువ శ్రీశైల జలాశయాలు పూర్తిస్థాయిలో నిండి ప్రవహిస్తున్నా జిల్లాకు రావాల్సిన వాటాను తీసుకురాలేకపోవడం బాధాకరమన్నారు. ముమ్మాటికీ పాలకుల నిర్లక్ష్యమే అన్నారు. హెచ్చెల్సీ ఆధునీకరణ పనులు చేపట్టి 14 ఏళ్లైనా ఇంత వరకూ పనులు పూర్తి కాకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. హంద్రీనీవా ఆయకట్టు భూములకు సాగునీరు అందించేందుకు వెంటనే కాలువలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే పిఎబిఆర్ కుడికాలువ కింద ఉన్న 49 చెరువులకు నీరు అందించాలని డిమాండ్ చేశారు. రాగులుపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా పంట పొలాలకు నీరు అందించాలని, హెచ్చెల్సీ 5వ కాలువ డిస్ట్రిబ్యూటర్ పనులు పూర్తి చేయాలని, చివరి ఆయకట్టుకు నీరు అందించాలని, కూడేరు మండలంలోని అరువకూరు, కమ్మూరు, పొడిచెరువు చెరువులను నీటితో నింపాలని, పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50వేలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈనెల 21న కలెకరేట్ ముందు నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సిపిఎం మండల కార్యదర్శి వెంకటేశులు, సి.మల్లికార్జున, వీరప్ప, నారాయణరెడ్డి, మేకల పెద్దన్న, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : రైతు సమస్యలు తెలుసుకోవడంతోపాటు సాగునీటి సాధన కోసమే సిపిఎం ఆధ్వర్యంలో బస్సుయాత్ర చేపట్టనున్నట్లు సిపిఎం పార్టీ మండల కార్యదర్శి భాస్కర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాగునీటి సమస్యల పరిష్కారం కోసం నేడు బొమ్మనహాల్ మండలం నుంచి సిపిఎం బస్సుయాత్ర ప్రారంభమై ఈనెల 21వ తేదీ వరకూ వివిధ ప్రాంతాల్లో సాగనున్నట్లు తెలిపారు. ఈనెల 17న శింగనమల మండలం కల్లూరు నుంచి యాత్ర ప్రారంభమవుతుందన్నారు. అక్కడి నుంచి కల్లుమడి, తరిమెల గ్రామాలకు మధ్యాహ్నం చేరుకుంటుందన్నారు. తర్వాత చిట్టూరుకు చేరుకుని పెద్దవడుగూరు మండలంలోకి ప్రవేశిస్తుందన్నారు. 18న నార్పల మండలం నుంచి కొరపాడు మీదుగా తిరిగి శింగనమల మండల కేంద్రానికి చేరుకుంటుందన్నారు. ఆయా తేదీల్లో ప్రజలు, రైతులు భారీగా తరలివచ్చి యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే బస్సుయాత్రలో సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి ఈనెల 21న కలెక్టరేట్ ముందు ధర్నా చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కొండారెడ్డి, జయరాముడు, శ్రీనివాసులు, సుంకన్న, ధన, ఆంజనేయులు, రామాంజనేయులు, ఆంజనేయులు, కుళ్లాయప్ప, సూర్యప్రకాష్, శ్రీనివాసులు, ఆంజనేయులు, ఎర్రిస్వామి లక్ష్మీనారాయణ, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి : ఆర్‌డిఒ

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ శ్రీనివాసులు

ప్రజాశక్తి-ఉరవకొండ

రెండు, మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం శాఖల అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని గుంతకల్లు ఆర్‌డిఒ శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి అన్ని ప్రభుత్వ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో నేటి నుంచి 16వ తేదీ వరకూ భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందన్నారు. కావున మండల స్థాయిలో కమాండ్ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఆయా మండల స్థాయిలో వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసుకుని ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందజేయాలన్నారు. ఆయా శాఖల అధికారులు వారి శాఖల పరిధిలో ముందు జాగ్రత్త చర్యలను తీసుకోవాలన్నారు. పశువులకు సంబంధించి ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా పశు సంవర్ధక శాఖ అధికారులు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. వర్షాలకు కూలిపోయే స్థితిలో ఉన్న ఇళ్లలో ఎవరూ ఉండకుండా చూడాలనిన్నారు. విద్యుత్ పోల్స్ పడిపోతే వెంటనే పునరుద్ధరించేందుకు సిద్ధంగా ఉండాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. మండల స్థాయిలో పూడికతీత చేపట్టేందుకు జెసిబిలను సిద్ధంగా ఉంచాలన్నారు. మెడికల్ అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. రిజర్వాయర్లు, కాలువలను ఎప్పటికప్పుడు పరిశీలించాలనిని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

30 నుంచి సయ్యద్ షా అంగారవలి సాహెబ్ ఉరుసు

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి, ముస్లిములు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కుల, మతాలకు అతీతంగా రాయలసీమ ప్రాంతంలో అత్యంత ప్రసిద్ధి చెందిన శ్రీ హజరత్ సయ్యద్ షా అల్లావలి సాహెబ్ 20వ ఉరుసు మహోత్సవంలో పాల్గొని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కర్నూలు జిల్లాలోని సయ్యద్ షా అల్లావలి సాహెబ్ దర్గాకు సంబంధించిన నిర్వాహకులు ఎమ్మెల్యే దగ్గుపాటిని కలిసి ఉత్సవానికి రావాలని ఆహ్వానించారు. ఈనెల 30న జెండానిషానితో వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. 31న గంధం మహోత్సవం, నవంబర్ 1న శుక్రవారం రాత్రి 9 గంటలకు 'గొప్ప ఖవాలి, తెలుగు పాటల కచేరి ఉంటుందన్నారు. చివరి రోజు 2న జియారత్ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ బలిజ సంఘం యువజన అధ్యక్షుడు తొండపునాటి రమేష్, టిడిపి నాయకులు ప్రభాకర్, గురుమూర్తి, బాషా, వలి, సుదర్శన్, వినోద్, రేవంత్, దినేష్, చంటి, ఉరుసు నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

జెఎన్‌టియుకు మరో గుర్తింపు

అనంతపురం : నగరంలోని జెఎన్‌టియుకు మరో గుర్తింపు లభించింది. ఉన్నత విద్యలో విశ్వ విద్యాలయాలకు ద టైమ్స్ అందించే ప్రపంచ స్థాయి ర్యాంకింగ్-2025లో అనంతపురం జెఎన్‌టియు 801 నుంచి వెయ్యిలోపు ర్యాంకు సాధించి సరికొత్త మైలు రాయిని చేరుకోవడమే కాకుండా దేశంలోని యూనివర్శిటీల్లో 23వర్యాంకు సాధించి రికార్డు సృష్టించినట్లు ఇన్‌ఛార్జి ఉపకులపతి హెచ్.సుదర్శనరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీచింగ్, నాణ్యమైన పరిశోధన, పరిశ్రమలతో అనుసంధానం, అంతర్జాతీయ దృక్పథం వంటి విషయాలను పరిగణలోకి తీసుకుని ఈ ర్యాంకు ప్రకటించారన్నారు. ఇందుకు కృషి చేసిన అధ్యాపకులు, బోధనేతర సిబ్బందికి అభినందనలు తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో ర్యాంకు వచ్చినందుకు రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య సిబ్బందికి అభినందనలు తెలిపారు.

వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

యల్లనూరు : అల్పపీడన ప్రభావంతో రానున్న రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో మండల వ్యాప్తంగా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ వాసుదేవరరెడ్డి సూచించారు. సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాపరులు మూగజీవాలను మేతకు అడవికి తీసుకెళ్లడం సురక్షితం కాదన్నారఉ. కావున రెండు రోజులపాటు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి మనోహర్‌బాబు, ఎపిఒ షబ్బీర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పామిడిలో ఆధార్ సెంటర్ ఏర్పాటుకు వినతి

పామిడి : మండల కేంద్రంలోని తహశీల్దా కార్యాలయంలో ప్రత్యేక ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని జనసేన, బిజెపి నాయకులు కోరారు. ఈమేరకు స్థానిక కార్యాలయంలో తహశీల్దార్ శ్రీధర్‌మూర్తికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మండల కేంద్రంలో ఆధార్ సెంటర్ లేకపోవడం వల్ల ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున ప్రజల సౌకర్యార్థం ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొట్టాల సూర్యనారాయణ, నక్కల రామాంజనేయులు, నల్లబోతుల వీరప్రతాప్, సురేష్, రాజు, రామ్‌నరేష్, సతీష్‌కుమార్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు చెరువు పరిశీలన

చెరువును పరిశీలిస్తున్న ఎంపిడిఒ అలివేలమ్మ

పుట్లూరు : రెండు, మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో మండల కేంద్రం సమీపంలో ఉన్న చెరువును ఎంపిడిఒ అలివేలమ్మ సోమవారం పరిశీలించారు. ఇందులో భాగంగా చెరువు కట్టలు, మరువలను పరిశీలించి స్థానిక అధికారులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. మూడు రోజులపాటు అప్రమత్తంగా ఉంటూ చెరువును పర్యవేక్షిస్తుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విఆర్ఒ వెంకటనారాయణ, పంచాయతీ కార్యదర్శి సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ పప్పుశనగ విత్తనాలు పంపిణీ

ఉరవకొండ : ఉరవకొండ, విడపనకల్లు మండలాల్లోని రైతులకు రాయితీ పప్పుశనగను సోమవారం పంపిణీ చేశారు. ఉరవకొండ మండలంలోని రాకెట్ల, కౌకుంట్ల గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి శుభకర్, విడపనకల్ మండల కేంద్రంతోపాటు వేల్పుమడుగు గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి చెన్నయ్య ఆధ్వర్యంలో పప్పుశనగ పంపిణీని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు సేవాకేంద్రాలకు రాయితీ పప్పుశనగ చేరిందన్నారు. రైతులు రిజిస్ట్రేషన్ చేసుకుని డబ్బులు కట్టి విత్తాలను తీసుకోవాలని సూచించారు. రాబోవు మూడు రోజుల్లో భారీ వర్షాలు కురవనున్న నేపథ్యంలో రైతులు పప్పుశనగను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వేల్పుమడుగు సర్పంచి తిప్పారెడ్డి, రైతు సేవాకేంద్రం సిబ్బంది రామ్మూర్తి, నీలిమ, రైతులు ఎన్.రామ్మోహన్, టి.సిసింద్రి, క్రాంతి, విశ్వ, సన్నప్పయ్య, ఎర్రిస్వామి, ఆవుల ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

పంటపొలాల పరిశీలన

గుత్తి : మండలంలోని వన్నెదొడ్డి గ్రామంలో వ్యవసాయ అధికారులు సోమవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా సేంద్రియ ధ్రువీకరణ ప్రక్రియ (ఆర్గానిక్ సర్టిఫికేషన్) కోసం దరఖాస్తు చేసుకున్న రైతులు దస్తగిరి, నాగార్జున పంట పొలాలను రెడ్డిపల్లి వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త కాత్యాయిని, వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.వెంకటరాముడు, మండల వ్యవసాయ అధికారి ముస్తాక్ అహ్మద్ పరిశీలించారు. పంట కోత ప్రయోగం కోసం కొంత భాగం పంటను సేకరించి సేంద్రియ ధృవీకరణ ప్రక్రియ కోసం పంపించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌతమపురి ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ ప్రతినిధి సతీష్, ఎఇఒ శ్రీనివాస్, విహెచ్‌ఎ అజయ్, మద్దిలేటి, హుస్సేనమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పప్పుశనగ కోసం 13,397 మంది రిజిస్ట్రేషన్

అనంతపురం : రబీ సీజన్‌కు సంబంధించి సబ్సిడీ పప్పుశనగ విత్తనాల కోసం ఇప్పటి వరకూ జిల్లాలో 13,397 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు సాంకేతిక వ్యవసాయ అధికారి రాకేష్‌నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నమోదు చేసుకున్న వరకూ 18,808 క్వింటాళ్లు పప్పుశనగ అవసరం అవుతుందన్నారు. ఇందుకు అనుగుణంగా రైతుసేవా కేంద్రాల్లో పప్పుశనగ నిల్వ చేయాలని ఏపీ సీడ్స్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

నార్పల ఎటిఎంలో చోరీకి విఫలయత్నం



వివరాలను సేకరిస్తున్న సిఐ కౌలుట్లయ్య, ఎస్ఐ సాగర్

నార్పల : మండల కేంద్రంలోని కూతలేరు వంక సమీపంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎటిఎంలో ఎలాంటి చోరీ జరగలేదని సిఐ కౌలుట్లయ్య తెలిపారు. సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని దుండగులు ఎటిఎం చోరీకి విపలయత్నం చేశారు. ఉదయం గమణించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సిఐతోపాటు ఎస్ఐ సాగర్ చోరీకి యత్నించిన ఎటిఎంను పరిశీలించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఆకతాయిలు, చిల్లర దొంగలు చోరీకి యత్నించారన్నారు. ఉదయం నుంచి ఎటిఎంలో భారీగా చోరీ జరిగిందని సోషల్ మీడియాల్లో వస్తున్న కథనాలు వాస్తవం కాదన్నారు. ఎటిఎంలో ఒక్క రూపాయి కూడా చోరీకి గురి కాలేదన్నారు. కాగా క్లూస్‌టీంను రప్పించి ఫింగర్ ప్రింట్స్, తదితర ఆధారాలు సేకరిస్తున్నట్లు వివరించారు.

నేరాలు ఘోరాలు

యువకుడు అనుమానస్పద మృతి

బొమ్మనహాల్ : మండలంలోని దర్గాహొన్నూరు గ్రామానికి చెందిన హరిజన హనుమంతు(30) సోమవారం అనుమానస్పద స్థితిలో మృతి చెందాడు. అతడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. గ్రామంలోని ఓ ఇంట్లో విద్యుత్ పనులు చేస్తుండగా షాక్‌కు గురై మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నటు ఎస్ఐ నబిరసూల్ తెలిపారు.

మట్కా నిర్వాహకుడు అరెస్టు

యల్లనూరు : మండల పరిధిలోని తిమ్మంపల్లి గ్రామంలో మట్కా నిర్వాహకుడు లడ్డు సురేష్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ రామ్‌ప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు పక్కాగా అందిన సమచారం మేరకు మట్కా నిర్వహిస్తున్న సురేషన్‌ను అదుపులోకి తీసుకోవడంతోపాటు మట్కా చీటీలు, రూ.20వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆత్మకూరు, బుక్కరాయసముద్రం, నార్పల మండలాల్లో అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న నాయకులు, అధికారులు

ఘనంగా 'పల్లె పండుగ'

ప్రజాశక్తి-శింగనమల

మండల కేంద్రంలో పల్లె పండుగ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఇందులో భాగంగా తహశీల్దార్ ఎస్.బ్రహ్మయ, ఎంపిడిఒ నిర్మలకుమారి కలిసి సుమారు రూ.36 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ పని చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే ఎంతో ప్రతిష్టాత్మకంగా పల్లె పండుగ కార్యక్రమాన్ని తీసుకొచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి గ్రామంల్లో సీసీ రోడ్లతోపాటు మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శి లీలారాణి విఆర్‌ఒ తాతయ్య, వైస్ ఎంపిపి విజయ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ జయశ్రీ, అనిల్, టిడిపి నాయకులు సి.వెంకటేశు, చిన్న నాగముని, శింగనమల గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి మసూద్‌వలి, మాసూల చంద్రమోహన్, బోయ సత్యనారాయణ, ఎం.ఆదినారాయణ, బాషా, బండి వెంకటనారాయణ, శంకర్‌నారాయణ, జడేజా, కాయగూర సత్తి, సత్యనారాయణ, ఆదినారాయణ, బోయ వెంకటనారాయణ, శివపురం ఎర్రిస్వామి, మహేష్‌యాదవ్, ఆర్మీ జిలాన్, షేక్షావలి, ఉపాధి హామీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరు : మండల పరిధిలోని వేములపల్లి, 85 నిట్టూరు, పిఎం.కొండాపురం గ్రామాల్లో సోమవారం పల్లె పండుగ కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. ఇందులో భాగంగా ఉపాధి హామీ పథకం నిధులతో ఆయా గ్రామాల్లో సీసీ రోడ్లకు భూమిపూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ వాసుదేవరరెడ్డి, ఇఒఆర్‌డి మనోహర్‌బాబు, ఎపిఒ షబ్బీర్, తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : మండల కేంద్రంలో పల్లె పండుగ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎంపిపి దాసరి సునీత, సర్పంచి ఎ.పార్వతి సీసీ రోడ్ల పనులకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ బిఎన్.శ్రీదేవి, క్లస్టర్ ఎపిడి అనురాధ, ఎంపిడిఒ సొలమన్‌రాజ్, ఇఒఆర్‌డి సదాశివ, పిఆర్ జెఇ మద్దిలేటి, ఆర్‌డబ్ల్యూఎస్ జెఇ నాగేంద్ర, పోలేరయ్య, పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసులు, ఇసి శివరామకృష్ణ, మండల నాయకులు పసుపల శ్రీరామిరెడ్డి, పొడరాళ్ల రవీంద్ర, బుల్లే నారాయణస్వామి, బుల్లే రాజా, కరణం చంద్రకాంతరావు, బిజెపి, జనసేన పార్టీ నాయకులు చొప్పా చంద్రశేఖర్, జి.ఎర్రిస్వామి, బండారు తేజ, బండారు అశోక్, కమల్, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె : మండల పరిధిలోని ఇల్లూరు, గార్లదిన్నె గ్రామాల్లో సోమవారం పల్లె పండుగ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా ఎంపిడిఒ యోగానందరెడ్డి, ఎపిఒ నాంచారమ్మ, ఇసి విజయ్‌కుమార్ కలిసి ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్లకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సుంక, తిరుమలేశు, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : మండల పరిధిలోని ఎ.కొండాపురం, సూరేపల్లి, కడవకల్లు, కందికాపుల పంచాయతీల్లో సోమవారం పల్లె పండుగ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉపాధి హామీ పథకం కింద నిర్మించనున్న సీసీ రోడ్లకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ అలివేలమ్మ ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ ప్రవీణ్, ఎపిఒ చెన్నకేశవులు, సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులు, ఉపాధి హామీ, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : మండల పరిధిలోని అనుంపల్లి, దిబ్బసానిపల్లి, నీలూరు, పాల్యం, రామగిరి, రామరాజుపల్లి గ్రామాల్లో సోమవారం పల్లె పండుగ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాల్లో సుమారు రూ.80 లక్షల నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపిడిఒ తేజోష్ణ, పిఆర్ డిఇ మురళీధర్, పిఆర్ ఎఇ హేమ్లానాయక్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ తిరుపాల్‌నాయక్, ప్రజాప్రతినిధులు ముసలిరెడ్డి, ఆర్‌ఆర్.రమేష్, రాజేష్‌నాయక్, తిరుపాలు, గోపాల్‌రెడ్డి, సుధాకర్, దేవేంద్రరెడ్డి, అశిత్తు, ఓబులేసు, నారాయణ, రాఘవ, హరీష్, ఓంకార్‌రెడ్డి, డేవిడ్, వెంకటేష్, రంజిత్, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండల కేంద్రంలోని బీసీ కాలనీతోపాటు బి.యాలేరులో సోమవారం పల్లె పండుగ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సీసీ రోడ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ శ్రీనివాసులు, ఎంపిడిఒ లక్ష్మీనరసింహా, తహశీల్దార్ లక్ష్మీనాయక్, సర్పంచి వరలక్ష్మి, మాజీ కన్వీనర్ మనోరంజన, శశాంక్‌చౌదరి, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

శింగనమలలో భూమిపూజ చేస్తున్న తహశీల్దార్ బ్రహ్మయ్య, ఎంపిడిఒ నిర్మలకుమారి

నార్పల : మండల కేంద్రంలో సోమవారం పల్లె పండుగ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని శక్తినగర్, జయసింహ కాలనీ, సుగాలి కొట్టల కాలనీల్లో సిసి రోడ్లు, క్రాసింగ్ సమీపంలో గోకులం నిర్మాణానికి అధికారులు, ప్రజాప్రతినిధులు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మండలాధ్యక్షురాలు ఆకుల అరుణమ్మ, డిఎల్‌డిఒ లలితాబాయి, మండల ప్రత్యేక అధికారి రామసుబ్బారెడ్డి, ఎంపిడిఒ గంగావతి, ఇఒఆర్‌డి శైలజారాణి, సర్పంచి సుప్రియ, ఉపాధి హామీ ఎపిఒలు ఎర్రమ్మ, రమేష్, రామారావు, పంచాయతీ కార్యదర్శి శ్యామల, టిడిపి నాయకులు ప్రతాప్‌చౌదరి, ఆకుల కిషోర్, మాజీ ఎంపిటిసి వేణుగోపాల్, కార్యదర్శులు పరశురాం, శ్రీనివాసులు, చరణ్, వార్డు సభ్యులు నాగభూషణం నాయుడు, శివయ్య, ఇంజనీరింగ్ అసిస్టెంట్ రంజిత్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం : పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ముప్పలకుంట, పిల్లలపల్లి గ్రామాల్లో ఆయా పంచాయతీల సర్పంచులు కొల్లాపురమ్మ, తలారి అంజనప్ప ఆధ్వర్యంలో పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మండల స్పెషల్ ఆఫీసర్, పిడి సలీంబాషా, ఎపిడి రమేష్‌నాయక్, ఎంపిడిఒ నందకిషోర్, పంచాయతీరాజ్ శాఖ ఏఈ విజయ్‌కృష్ణ, ఐసిడిఎస్ సూపర్వైజర్ కాశీంబి, టిడిపి మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు, వీఆర్వో మర్రిస్వామి, టిఎ అవినాష్, జేఈ ప్రకాష్, నాయకులు చిత్తప్ప, లక్ష్మన్న, పత్తిపాటి వెంకటేశులు, జనార్ధన్, అనిల్, నల్లప్ప, గోవిందప్ప, అంజనప్ప, కుళ్లాయిస్వామి, సురేష్, హనుమంత, నారా హనుమంతరాయుడు, వడ్డే ఎర్రిస్వామి, ఏకాంత్, రాము పూజారి, వెంకటప్ప, శీనప్ప, తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరు, పుట్లూరు, పామిడి మండలాల్లో అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న నాయకులు, అధికారులు

వసంతోత్సవం

గుత్తి : దసరా వేడుకలను పురస్కరించుకుని ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం గుత్తిలో వసంతోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అమ్మవారిశాల నుంచి కోటలోని రేణుక ఎల్లమ్మ దేవాలయం, బసవేశ్వర ఆలయం, మెయిన్ బజార్లోని వినాయకుని గుడి, సంతాన గోపాల స్వామి ఆలయం వరకూ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి విగ్రహాన్ని ఊరేగించారు. ఇందులో భాగంగా భక్తులు రంగులు చల్లుకుంటూ.. కేరింతల కొడుతూ చిందులు వేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వసంతోత్సవంలో పాల్గొన్న యువకులు

పంటకోత ప్రయోగం

పుట్లూరు : మండల పరిధిలోని చెర్లోపల్లి గ్రామంలో సాగు చేసిన మొక్కజొన్న పంటలో వ్యవసాయ శాఖ అధికారిణి కాత్యాయిని ఆధ్వర్యంలో సోమవారం పంటకోత ప్రయోగం చేశారు. అలాగే శనగలగూడూరులో రైతు మధుసూదన్ సాగు చేసిన సోయచిక్కుడులో పంటకోత ప్రయోగం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ హరి, విహెచ్ఎ రామలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగం చేస్తున్న అధికారులు